ప్రజాశక్తి
శనివారం 9 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

శివరాత్రి సందర్భంగా పాచిపెంట మండలం పారమ్మకొండపై వెలసిన అఖండ జ్యోతిని దర్శించుకుంటున్న యాత్రికులు

5లో...

మన్యం బంద్‌కు మద్దతుగా సిపిఎం దీక్ష

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆదివాసీల హక్కుల రక్షణకు ఈనెల 10న ఏజెన్సీ బంద్‌కు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆదివాసీ జన రక్షణ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షను ప్రారంభించిన సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ గిరిజనులకు నష్టం చేసే విధానాలను కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. అందులో భాగంగానే ఎన్నో ఏళ్ల పోరాడి సాధించిన హక్కులను కాలరాస్తూ గిరిజనులకు ద్రోహం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి గిరిజన నిరుద్యోగులకు ఉపయోగం లేదన్నారు. అందుకనే గిరిజన నిరుద్యోగుల స్పెషల్ డిఎస్సీ విడుదల చేయాలని, రద్దు చేసిన జిఒ 3పై ఆర్డినెన్స్ ఇవ్వాలని, అటవీ భూముల చట్ట సవరణ రద్దుచేసి 1/ 70 చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయలని, పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న తలపెట్టిన మన్యం బందుకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఈ దీక్షలు జరుగుతున్నాయి అన్నారు. వన సంరక్షణ పేరుతో బిజెపి ప్రభుత్వం 1/70 చట్టానికి తూట్లు పొడుస్తుందని, ఐదో షెడ్యూల్లో ఉన్న గిరిజన సంపద గనులు, ఖనిజాలను, విలువైన భూములను కొల్లగొట్టి కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు నైవేద్యం పెడుతుందని విమర్శించారు. గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి బిజెపి అడుగులకు మడుగులొత్తుతూ గిరిజనుల హక్కులను, సంపదను దోపిడి దారులకు కట్టబెడుతున్నారని అన్నారు. కావున గిరిజన సమస్యలు పరిష్కారం చేయాలని జరుగుతున్న ఏజెన్సీ బంద్‌ను, నిరసన ప్రదర్శనలు ర్యాలీలు మద్దతుగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, వై.మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి

జి.వెంకటరమణ, బంటు దాసు, నాయకులు జి.వెంకటరమణ, పి.రాజశేఖర్, సూరిబాబు, పి.రాము, ఇ.బలరాం, సింహాచలం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: జిఒ 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్సు తీసుకురావాలని కోరుకుంటూ ఈనెల 10న నిర్వహించనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల కార్యదర్శి వంతల సుందరరావు కోరారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మన్యం బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఏకలవ్య పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం గిరిజనేతరులతో భర్తీ చేసిందన్నారు. ప్రభుత్వం డిఎస్సీ ప్రకటిస్తే వాటిలో గిరిజన సంక్షేమ శాఖకు 1025 పోస్టులు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. వీటిలో ఐటిడిఎ పాఠశాలల్లో 517 పోస్టులను నోటిఫై చేసినట్లు చెప్పారు. దీనిలో కేవలం ఆదివాసీలకు 38 పోస్టులు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. అంటే ఏజెన్సీ ప్రాంతంలో ఐదు శాతం ఉన్న గిరిజనేతరులకు 95 శాతం ఉద్యోగాలు, 95 శాతం ఉన్న గిరిజనులకు ఐదు శాతం ఉద్యోగాలు కేటాయించడం అన్యాయమన్నారు. ఆదివాసీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 3 రద్దు చేసి మూడేళ్లయినా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పునరుద్ధరణకు కృషి చేయడం లేదని అన్నారు. ఆర్డినెన్స్ ద్వారా జీవో 3ను పునరుద్ధరణ చేయాలని కోరుతూ ఈనెల 10న నిర్వహించనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు తాడంగి గాసి పాల్గొన్నారు.

కొమరాడ : ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు హెచ్ రామారావు పిలుపునిచ్చారు. బంద్‌కు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలని, జీవో 3పై ఆర్డినెన్స్ ఇవ్వాలని కోరారు. అటవీ భూముల చట్ట సవరణ రద్దు చేయాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పదెకరాల వరకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అన్ని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించి విద్య, వైద్యం, నిత్యాసర వస్తువులు తెచ్చుకోవడానికి వీలుగా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు యు.వెంకటేష్, కె.సాంబమూర్తి, రెడ్డి శివున్నాయుడు, మాణిక్యం, కైలాస్, మధు పాల్గొన్నారు.

సాలూరులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

బొత్స నోట బెల్లాన మాట

- మరోసారి పార్లమెంట్ అభ్యర్థిగా చంద్రశేఖర్?
- వైసిపిలో మలుపు తిరుగుతున్న రాజకీయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వైసిపిలో రాజకీయాలు మలుపు తిరుగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు యథాతథంగానే కొనసాగే అవకాశం ఉందా? అంటే ఔననే సమాధానమే గట్టిగా వినిపిస్తోంది. వైసిపి తరపున జిల్లా రాజకీయాలను శాశిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చిలకపలుకులే ఇందుకు నిదర్శమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా అత్యంత ఉత్కంఠ భరింతగావున్న విజయనగరం ఎంపీస్థానంలో తిరిగి పెదబాబే (బెల్లాన చంద్రశేఖర్) పోటీ చేస్తారంటూ నిన్నగాక మొన్న రాత్రి గరివిడి మండలం దేవాడలో చేసిన వ్యాఖ్యలు ఎంపీ అభ్యర్థి ఎవరు? అనేదానిపై దాదాపు క్లారిటీ ఇచ్చినట్టేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అసెంబ్లీకి కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేలనే కొనసాగించా లంటూ ఆయన చాలా రోజుల క్రితమే అధిష్టానానికి సూచిన చేసినట్టుగా సమాచారం. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లాలో దాదాపు రెండు నెలలుగా రాజకీయ వాతావరణం వేడిక్కెన విషయం విధితమే. జిల్లా పార్టీ సమన్వయ కర్త, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎంపీగా ఆయనకు అవకాశం ఉండవచ్చని ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆ తరువాత పార్టీ విడుదల చేసిన జాబితాలో విజయనగరం ఎంపీ, మినహా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మిగిలిన స్థానాలన్నింటికీ అభ్యర్థుల పేర్లు బయటకు వచ్చాయి. శ్రీనివాసరావు పేరు బయటకు ప్రకటించకపోయినప్పటికీ అభ్యర్థి మాత్రం ఆయననే అని కూడా విస్తృత ప్రచారం సాగింది. ఎంపీగా బెల్లానను తప్పిస్తే, అందుకు తగిన అవకాశం ఇవ్వాలంటూ మంత్రి బొత్స సత్యనారాయణ అధిష్టానం దగ్గర గట్టిపట్టే పట్టారట. అంతకీ శ్రీనివాస రావును ఎంపీగా పంపాలను కుంటే, జెడ్‌పి పీఠం బెల్లాన చంద్రశేఖర్ లేదా ఆయన కుటుంబ సభ్యుల్లో ఎవరికో ఒకరికి ఇవ్వాలని మంత్రి ప్రతిపాదన చేసినట్టుగా చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసరావు జెడ్‌పి పీఠాన్ని వదులుకునేందుకు ఇష్టపడలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో కొత్తగా తలనొప్పులు లేకుండా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా సిట్టింగ్‌లనే ఉంచాలని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. అందువల్లే పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో శ్రీనివాసరావును వైసిపి ఉత్తరాంధ్ర డిప్యూటీ సమన్వయకర్త బాధ్యత అప్పగించారని చర్చనడుస్తోంది. మరోవైపు మంత్రి బొత్స తాను కూడా తిరిగి చీపురుపల్లి నుంచే పోటీచేస్తానని క్లారిటీ ఇవ్వడంతో ఆయన అనుయాయుల్లో జోష్ నెలకుంది. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో ఈలోపే అభ్యర్థుల జాబితా అధికారికంగా వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేటలో వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

వేసవి ప్రారంభంలోనే ఎండలు భగభగ మండడంతో ప్రజలు ఈ వేసవి తాపం నుంచి ఎలా తట్టుకోవాలనని ఆందోళన చెందుతున్నారు. మార్చి మొదటి వారంలోనే ఇలా ఉంటే ఇంకా ఏప్రిల్, మే నెలలో ఎండలు ఇంకెలా ఉంటాయోనని బెంబేలెత్తిపోతున్నారు. ఈ తరుణంలో ఒక్క వర్షం పడితే వాతావరణం చల్లబడుతుంది. వర్షం కోసం ప్రజలు ఎదురుచూస్తున్న సమయంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా వేడిగా ఉన్న వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. ఈ వర్షం ప్రజలకే కాకుండా మామిడి, జీడి, నువ్వు, పెసలు, మినుములు తదితర పంటలకు ఉపయోగపడుతుంది.

మున్సిపల్ కమిషనర్‌కు కోర్టు ధిక్కార నోటీసు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో గల వెంకటేశ్వరా డీలక్స్ స్థలం వివాదం మున్సిపల్ అధికారులను వెంటాడుతోంది. ఇటీవల కోర్టు కేసుల్లో ఉన్న ఈ స్థలాన్ని కొనుగోలుదారుల పేరిట మున్సిపల్ మ్యుటేషన్ చేశారు. ఇదే వ్యవహారంలో గత ఏడాది మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు ఎసిబి వలలో చిక్కి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత ఇంఛార్జి కమిషనర్‌గా పనిచేసిన టి.జయరాం 2023 డిసెంబర్ 28న ఈ స్థల వివాదానికి సంబంధించిన ఇరువర్గాలను విచారించారు. 8 వారాల్లో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అప్పటి కమిషనర్ జయరాం విచారణ నిర్వహించారు. ఆ విచారణ నివేదిక ఇవ్వాలని ఆ విచారణకు హాజరైన పిబి శ్రీనివాస్ కోరారు. విచారణ నివేదిక ఉద్దేశపూర్వకంగానే ఇవ్వలేదని, అది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని పేర్కొంటూ హైకోర్టు న్యాయవాది జి.గోపాలకృష్ణ మున్సిపల్ కమిషనర్ పి.ప్రేమ ప్రసన్నవాణికి నోటీసు జారీ చేశారు. దీనిపై నిర్దేశించిన గడువులోగా వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసు పంపించారు. గత కొన్నేళ్లుగా వివాదంలో ఉన్న వెంకటేశ్వరా డీలక్స్ స్థలాన్ని కొద్ది రోజుల క్రితం కొనుగోలుదారుల పేరిట మ్యుటేషన్ చేయడం వెనుక పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి మున్సిపల్ అధికారులకు భారీ ఎత్తున ముడుపులు అందడంతో కోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి మ్యుటేషన్ చేశారనే ప్రచారం జరుగుతోంది.

సిగ్నల్స్ లేక గిరిజనులకు అవస్థలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బయోమెట్రిక్ విధానం రద్దుచేసి పాత పద్ధతిలోనే ప్రతి నెలా రేషన్ బియ్యం ఇవ్వాలని మండలంలోని నెల్లికెక్కువ గ్రామ గిరిజనులు దుడ్డుఖల్లు డిఆర్ డిపో వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ప్రతి నెలాగనే ఈరోజు కూడా రేషన్ బియ్యం కోసం డిఆర్ డిపోకు రాగా నెట్వర్క్ పనిచేయక ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇక్కడే ఉండిపోయామని లబ్ధిదారులు తెలిపారు. రేషన్ బియ్యం కోసం బయోమెట్రిక్ పడక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో మిగతా పనులు చేయలేక పోతున్నామని సిపిఎం మండల కార్యదర్శి పి.తిరుపతి రావుకు విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో నెట్వర్క్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. సుదూర ప్రాంతాలను వస్తున్న గిరిజనులు చాలాసేపు నిరీక్షించి, నిరాశతో వెనుతిరుగుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు దృష్టి సారించి పాత విధానంలోనే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

సభలో మాట్లాడుతున్న కవి గంట్యాడ గౌరినాయుడు

ఘనంగా మహిళా దినోత్సవం

మహిళల సారధ్యంలో ఉద్యమాలు విజయవంతం : ప్రముఖ కవి గంట్యాడ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మహిళలు ఉద్యమాల్లోకి వచ్చి సారధ్యం వహిస్తే తప్పక విజయవంతమవుతాయని కవి గంటేడ గౌరి నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో యుటిఎఫ్, సిఐటియు, ఐద్వా సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో ఆయన మాట్లాడారు. 42 రోజల అంగన్‌వాడీల పోరాటం స్ఫూర్తిదాయకంగా జరిగిందని, మహిళలు ఎక్కువగా పాల్గొన్నారు కనుకనే ప్రభుత్వం కూడా మెట్టుదిగి కొన్ని సమస్యలను పరిష్కరించిందని అన్నారు. సిఐటియు నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తుందని, ఈ దాడిని తిప్పి కొట్టడంలో మహిళలు ప్రముఖ పాత్ర వహించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ పార్లమెంట్, శాసన సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ రాజామణి అధ్యక్షత వహించిన సదస్సులో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు, అంగన్వాడీ నాయకురాలు అలివేలుమంగ, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొనగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గోవిందమ్మ వందన సమర్పణ చేశారు.

గుమ్మలక్ష్మీపురం : మహిళల రక్షణకై ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో దేశంలో ఎక్కడ చూసినా ప్రతిరోజు ఏదో ఒకచోట వీరిపై దాడులు జరుగుతున్నాయని శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారడంతో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్నా దోషులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దాడులు ఆగడం లేదన్నారు. దిశ, నిర్భయ వంటి మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరోవైపు శ్రామిక మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు తప్ప వారికి సంక్షేమం కరువైందన్నారు. కావున మహిళలు హక్కులు, చట్టాల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఐద్వా మంల కార్యదర్శి కె.లక్ష్మి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ, యుటిఎఫ్ మండల నాయకులు భారతి, పలువురు ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

వీరఘట్టం : మహిళపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలని అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు నర్సిపురం దుర్గా చంద్ర చూడామణి కోరారు. స్థానిక సిపిఐ(ఎంఎల్) కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరవైందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు గడగమ్మ, గౌరీశ్వరి మాట్లాడుతూ సమాన హక్కులు, అవకాశాల కోసం పోరాడాలని మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.సూర్య కళ, తదితర మహిళలు పాల్గొన్నారు.

కురుపాం : మహిళలు చైతన్యంతో ఉంటేనే దేశాభివృద్ధికి సాధ్యపడుతుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో గోటివాడ పంచాయతీలో గల నేరేడువలసలో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళలనుద్దేశించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయంలో కూడా పురుషులతో పాటు మహిళలు సగ భాగంలో ఉన్నారని అన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ టి.తట్టమ్మ, జడ్పిటిసి జి.సుజాత, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్, సొసైటీ సభ్యులు వి.లక్ష్మి, నిర్మల, మహిళ ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి తోనే మహిళలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్ : వైసిపి ప్రభుత్వం మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించిందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే సారధ్యంలో వైసిపి మహిళా ప్రజా ప్రతినిధులు, పట్టణ మహిళలు, వాలంటీర్లు, గృహసారధులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మనంతా కలిసి నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు డాక్టర్ యాళ్ల పద్మజ, దిశా సెల్ మహిళ హెడ్ కానిస్టేబుల్ లావణ్య, గంట శైలజ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీస్వరి, వైస్ చైర్పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మహిళా కౌన్సిలర్లు, గృహ సారదలు, వాలంటీర్లు, పట్టణ మహిళలు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో మహిళలకు సంపూర్ణ రక్షణ

పార్వతీపురంరూరల్ : టిడిపి హయాంలోనే రాష్ట్రంలో మహిళల హక్కులకు సంపూర్ణ రక్షణ కలిగిందనిటిడిపి పార్వతీపురంనియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విజయ చంద్ర మాట్లాడుతూ టిడిపి మహిళలకు గౌరవిస్తుందని అన్నారు. టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో కేక్ కట్ చేస్తున్న ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు

సీతానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఇఒ జి.సూరిదేముడును పార్వతీపురానికి చెందిన లయన్స్ క్లబ్ వారు ఘనంగా సన్మానించారు. విద్యపరంగా ఆమె అందించిన విశిష్ట సేవలకు గాను ఈ సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు దొడ్డి మోహన్, డాక్టర్ యాళ్ల వివేక్, డాక్టర్ ప్రతిభాదేవి, డాక్టర్ పద్మజ, డాక్టర్ వాగ్దేవి, సీనియర్ అడ్వకేట్ జోగారావు, చీఫ్ జస్టిస్ దామోదర్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం

కురుపాం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసి 40మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 16 మందికి దృష్టి దోషం ఉన్న వారికి ఉచితంగా కళ్ల జోళ్లు, 15 మంది అంతర కుసుమం (కాట్రాక్ట్) లోపం ఉన్న వారికి శస్త్ర చికిత్సలు కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించమని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర రజని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

మహిళలను సన్మానిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

కురుపాం : సభలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

వీరఘట్టం : సదస్సులో మాట్లాడుతున్న ఐప్వా జిల్లా అధ్యక్షులు చంద్రచూడామణి

శైవక్షేత్రాలకు పోటెత్తిన జనం

యాత్రికులతో హోరెత్తిన పారమ్మ కొండ
కిటకిటలాడిన గుంప దేవాలయం

పారమ్మకొండపై పూజలు చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో గల పలు శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. శుక్రవారం వేకుజాము నుండే భక్తులతో శివాలయాలు కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా మండలంలోని పనుకువలస పంచాయతీ పెద్ద చీపురువలస సమీపాన గల పారమ్మ కొండ వద్ద ఉత్తరాంధ్ర, ఒడిశా, చత్తీస్గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు పారమ్మ తల్లిని దర్శించుకున్నారు. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర దంపతులు పారమ్మ కొండకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆయతో పాటు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అమ్మవారిని దర్శించుకున్నారు. పారమ్మ కొండ దిగువున నిర్మించిన పారమ్మ తల్లి దేవాలయానికి భక్తులు తండోపతండాలుగా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండపై ఏర్పాటు చేసిన అఖండ జ్యోతిని సందర్శకులు తిలకించారు. యాత్రికుల సౌకర్యార్థం సాలూరు పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భోజనాలు, అల్పాహారం, ఉసిరికాయలు, మజ్జిగ, పులిహోరా ప్యాకెట్లు, మంచినీళ్ళు అందజేశారు సాలూరు ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సులు కొండ వద్దకు ఏర్పాటు చేశారు. సాలూరు సిఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై పి.నారాయణరావు, పోలీస్ సిబ్బంది పారమ్మకొండ జాతర పరిసరాల్లో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు, వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు. పాచిపెంట పిహెచ్సి ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు కావాల్సిన మందులు అందజేశారు. అలాగే సాలూరు పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సంస్థలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాయి.

కురుపాం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ మండలంలోని గుమ్మలో వెలిసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : మహాశివరాత్రి సందర్భంగా జంఝావతి -నాగవళి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తాకిడితో కళకళలాడింది. శుక్రవారం వేకువ జాము నుంచి సోమేశ్వరస్వామిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ సిబ్బంది సౌకర్యాలు కల్పించినా, కొంత అసౌకర్యంతో ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో ప్రవేశానికి భక్తుల నుంచి టిక్కెట్ల రూపంలో డబ్బులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నా సౌకర్యం కల్పించడంలో దేవదాయ శాఖ విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తాయి. కనీసం పేద భక్తుల కోసం ఉచిత దర్శనం పెట్టకపోవడంతో ఈ ప్రాంత గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్లు రూపంలో అధికంగా వసూలు చేసినప్పటికీ ఆలయ అభివృద్ధిని కనీసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందరం లేదని ఆలయ కమిటీ సభ్యులు కూడా మండిపడుతున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అల్లర్లు జరగకుండా కొమరాడ ఎస్సై కే నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో వివిధ స్వచ్ఛంద

పారమ్మకొండపై జనాలు

సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తుల రాకపోకల కోసం పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి సుమారు పది బస్సులు వరకు నడిపినప్పటికీ ప్రైవేటు వాహనాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పార్వతీపురం రూరల్ : మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మండలంలోని పలు శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రఖ్యాతిగాంచిన అడ్డాపుశిలలోని కాశీఅన్నపూర్ణ క్షేత్రంలో శుక్రవారం వేకువ నుంచి భక్తులు తాకిడి ఎక్కువ కావడంతో క్యూ లైన్లు దర్శనమిచ్చాయి. వచ్చిన వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా మందిర చైర్మన్ అక్కిన సుందరనాయుడు ఆధ్వర్యంలో తాగునీరు, క్యూలైన్లు ప్రసాదం ఏర్పాటు చేశారు.భక్తుల కొరకు వైద్యశాఖ ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు. శుక్రవారం రాత్రి లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పురోహితులు శ్రీనివాస్ పండా తెలిపారు. అలాగే తాళ్లబురిడి, నర్సిపురం, వెంకంపేట, చిన్నబొండపల్లి గ్రామాలలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు దేవాలయాల్లో మహాశివరాత్రి పురస్కరించుకొని మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అడ్డాపుశిలలో పూజలు చేస్తున్న మహిళలు

కురుపాం : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

సీతానగరం : మండలంలోని సీతానగరం గుచ్చిమి, బూర్జ వెంకటాపురం, లచ్చయ్యపేట తదితర గ్రామాల్లో శివరాత్రి పురస్కరించుకొని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు క్యూలో నిలబడి పూజలు చేసేందుకు వచ్చారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను తీసుకున్నారు.

సీతంపేట : మండలంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాల్లో భక్తులు ప్రజలు శివనామ స్మరణతో శివాలయాల్లో మారుమోగింది. సీతంపేటలో కాశీ విశ్వేశ్వర ఆలయం పులిపుట్టిలో ఉన్న భూలింగేశ్వరి ఆలయం రామగిరి క్షేత్రం వద్ద విశ్వేశ్వరుని ఆలయం భక్తులతో పోటెత్తింది. భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుంపలో వైద్యశిబిరం

కొమరాడ : మహా శివరాత్రి మహోత్సవం సందర్భంగా గుంప సోమేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులకు, ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా కొమరాడ పిహెచ్సి ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి డిఎంఒ డాక్టర్ టి.జగన్ మోహనరావు శుక్రవారం పర్యవేక్షించారు. శిబిరంలో మందులు, పరీక్షలు పరిశీలించారు. అనంతరం పలు ఆరోగ్య పరమైన జాగ్రత్తలు, సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా కాపారాపు ఫౌండేషన్ వారు డాక్టర్ జగన్మోహన్కు దుస్సాలువతో సత్కరించి, మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయకుమారి, సూపర్ వైజర్ జయగౌడ్, దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పార్వతీపురంరూరల్ : శివరాత్రి సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా మండలంలోని అడ్డాపుశిలలో గల కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఎండ తాపం నుంచి ఉపశమనం కోసం పలు రకాల మందులను శిబిరంలో ఏర్పాటు చేశారు. ఆరోగ్య పరంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పద్మ, పైడితల్లి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కొమరాడ : గుంప దేవాలయం యాత్రికుల రద్దీ

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పులిహోరా పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు, ప్రయాణికులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పులిహోరా, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మరెన్నో కార్యక్రమాలు చేసేందుకు ముందుకు వస్తామని కమిటీ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఆరిశెట్టి గోవిందు జోనల్ చైర్మన్ ఎవి సత్యనారాయణ, ఐపిసి కోఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు కె.లక్ష్మణరావు, కె.వాసుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పెదబొండపల్లిలో భారీగా అన్నదానం

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పెదగొండపల్లి రామలింగేశ్వరాలయంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు మండల ఫకీరు ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామ ప్రజలు విచ్చేసి ప్రసాదాన్ని స్వీకరించారు.

సీతానగరంలో యాత్రికులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నిరుద్యోగ గిరిజన యువతకు శిక్షణ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

స్థానిక యూత్ శిక్షణా కేంద్రంలో గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాల నిమిత్తం శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. స్థానిక వైటిసిలో సోమవారం నుంచి మరో మూడు బ్యాచులు కోర్సులను ప్రారంభిస్తామని వైటిసి ఇంచార్జ్ రాము, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. ప్రస్తుతం జనరల్ డ్యూటీ అసిస్టెంట్, రిటైల్ స్టోర్ మేనేజర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను మొదలు పెట్టేందుకు అధికారుల నుండి అనుమతి లభించిందని, అందులో భాగంగా నేడు జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుకు సంబంధించి ఓరియంటేషన్ సెషన్ ప్రారంభించామని అన్నారు. మిగిలిన శిక్షణలు కూడా త్వరలోనే మొదలుపెడతామని, వైటిసిలో శిక్షణలు సకాలంలో పూర్తి చేసి, సర్టిఫికెట్లు మంజూరు చేసి సంబంధిత ప్రైవేట్ సెక్టార్లో ఉపాధి అవకాశాలు నేరుగా కల్పించబడతాయని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ తెలియజేశారని అన్నారు. ఈ మేరకు నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు పై కోర్సులను సక్రమంగా పూర్తి చేసి ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కిమ్మి-రుషింగి వంతెన

వంతెన ప్రారంభానికి వేళాయే...

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి- విజయనగరం జిల్లా వంగర మండలం రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై నిర్మించిన వంతెన ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ వంతెనను ఈనెల 11న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వంతెన నిర్మాణ పనులు గత ఏడాది మేలో పూర్తి కావడంతో పాదచారులు, వాహనదారులు ఇప్పటికే వీటిపైన రాకపోకలు సాగుతున్నాయి. అయితే మరికొద్ది రోజులలో ఎన్నికలు సమీపిస్తుండడంతో తమ ప్రభుత్వ హాయంలోనే పనులు పూర్తిచేసినట్లు చెప్పుకునేందుకు పాలకులు వంతెనను ప్రారంభించేందుకు ఉత్సాహపడుతున్నట్లు తెలిసింది.

ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి - బెలగాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాలకు ప్రత్యేకంగా గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు వైద్య సేవలందించేందుకు పిహెచ్ల, సబ్ సెంటర్ల పరిధిలో నియమితులైన ఎఎన్ఎంలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహించేలా సర్దుబాటు చేయడం సరైంది కాదని, శాస్త్రీయమైనది కాదన్నారు. ఈ విధంగా సర్దుబాటు చేయడం వల్ల అటు గిరిజన ప్రాంతాల్లో అంతంతమాత్రంగానే ఉన్న ప్రభుత్వ వైద్య సేవలు మరింత అధ్వాన్నంగా తయారౌతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన మోడల్ స్కూల్, ఎపి గిరిజన, సాంఘిక, వెనుకబడిన, కస్తూరిబా, జ్యోతిరావు పూలే విద్యా సంస్థల మాదిరిగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహాలకు ఎఎన్ఎంలను నియమించాలని రంజిత్కుమార్ డిమాండ్ చేశారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి టి.జగదీశ్వరి గెలుపునకు మండలంలో గిరి శిఖర గ్రామాలైన వబ్బంగి, ఊసకొండ, జరడ, నీలకంఠాపురం పంచాయతీల్లో కుటుంబ సారథులు టిడిపి, జనసేన ఉమ్మడి నాయకులు కార్యకర్తలు కలిసి గెలుపుకు కష్టపడి పని చేద్దామని శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి శంకర్రావు, నాయకులు ఈశ్వర్, లక్ష్మణరావు, శ్రీను, అప్పన్న, బూగన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న టిడిపి -జనసేన నాయకులు

సామంతుల వైపే అందరి చూపు

ప్రజాశక్తి- పాలకొండ

జెడ్పిటిసి మాజీ సభ్యులు సామంతుల దామోదరరావు ఎవరికి మద్దతు ఇస్తున్నారన్నది చర్చనీయాంశమవుతుంది. కొంత కాలంగా పాలకొండ, వీరఘట్టం మండలాల్లో పట్టు ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందిన సామంతుల దామోదరరావు ఈసారి ఎన్నికల్లో ఆయన చూపు ఏ పార్టీ వైపు ఉంటుందోనని చర్చనీయాంశమవుతుంది. ఆది నుంచి పాలకొండ నియోజకవర్గ ఇంఛార్జి నిమ్మక జయకృష్ణకు వ్యతిరేకిస్తున్న ఆయన ఇప్పటికీ మద్దతు ఇవ్వడం లేదు. బలమైన వర్గానికి చెందిన నేతగా ఉన్న ఆయన కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉన్నారు. అయితే మొదటి నుంచి జయకృష్ణకు వ్యతిరేకంగానే ఈయన పని చేస్తున్నారు. జయకృష్ణకు వ్యతిరేకంగా ఆయన మరో కొత్త వ్యక్తిని తెరపైకి తీసుకొచ్చారు. అయితే జయకష్ణ ఆయన్ను ఇంతవరకు స్వయంగా కలవలేదని తెలుస్తుంది. ఆయనతో పాటు పాలకొండ మండల మాజీ ఎంపిపి ప్రతినిధి వారాడ సుమంత్ నాయుడు, వీరఘట్టం మాజీ జడ్పీటీసీ ప్రతినిధి ఖండాపు వెంకటరమణతో పాటు పాలకొండ, వీరఘట్టం మండలాల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు ఆయనతో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ఈయన జయకృష్ణకు వ్యతిరేకంగా ఉంటూనే ఆ పార్టీలో ఎవరికి టికెట్ ఇచ్చినా పని చేసేందుకు సిద్ధమని పై స్థాయి నాయకుల ముందు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

బహుళ పంటలతో జీవ వైవిధ్యం

ప్రజాశక్తి - పాచిపెంట

కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేలను ఏడాది అంతా ఏదో ఒక పంటతో కప్పి ఉంచాలని, అలా చేసినప్పుడే భూమిలో జీవవైవిధ్యం పెరిగి భూసార పరిరక్షణ జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ లీడ్ ఆఫీసర్ కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని సరాయివలస, పనుకువలసలో రైతులు కుమార్, సుకరమ్మ వేసిన ఎటిఎం పద్ధతి కూరగాయలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వేసవిలో సాగుభూమి ఏ పంట లేకుండా ఉన్నట్లయితే విపరీతమైన ఎండకు భూమిలో ఉన్న పోషకాలు నశించి సేంద్రియ పదార్థం శాతం తగ్గి భూసారం క్షీణిస్తుందన్నారు. కావున ఏదో ఒక పంటతో భూమిని ఏడాది పొడవునా కప్పి ఉంచాలని తెలిపారు. అంతేకాక ఏకపంట విధానం కంటే బహుళ పంటలు పండించినట్లయితే భూమి లోపల, జీవావరణంలో జీవ వైవిధ్యం పెరుగుతుందని తెలిపారు. మిత్ర పురుగుల సంఖ్య అధికమవుతుందని, భూమి లోపల ఉపయోగపడే సూక్ష్మజీవులు సంఖ్య కోటానుకోట్లుగా వృద్ధి చెందుతుందని రైతుకు కూడా పలుపంటల విధానం వల్ల అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. కావున రైతులు విత్తన గుళికలు తయారు చేసుకుని ప్రస్తుతం ఉన్న పంట పూర్తి కాగానే డ్రై సోయింగ్ పద్ధతిలో భూమిలో తేమ లేకపోయినప్పటికీ విత్తనాలు చల్లుకునే విధానాన్ని రైతులకు తెలియజేయాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ యాంకర్ యశోదమ్మ, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ పూర్వపు విజయనగరం జిల్లాలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఉపాధ్యాయులను మొదటి విడతగా 9 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేస్తూ జిఒ 10 ప్రకారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తుర్వులను అనుసరించి శుక్రవారం 9 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఉత్తర్వులను ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ చేతుల మీదుగా అందజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన ముచ్చర్ల వీధికి చెందిన డి.శంకరరావు(35) రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయంకావడంతో చికిత్స పొందుతూ శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 3న పాలకొండ మండలం పొట్లిలో జరిగే బంధువుల శుభకార్యాన్ని చూసుకొని ద్విచక్ర వాహనంపై శంకర్రావు, పి.శ్రీవాసరావు స్వగహానికి చేరుకునేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చీకటి పడడంతో రేగులపాడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో శంకర్రావు తలకు తీవ్ర గాయమైంది. శ్రీనివాసరావుకు కూడా బలమైన గాయాలయ్యాయి. దీంతో వీరిని 108 సహాయం ద్వారా పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్స తరలించారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రాగోలు జేమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శంకర్రావుకు భార్య ఉమా, కుమార్తె గాయత్రి, కుమారుడు ఉదయ్ కుమార్ ఉన్నారు. శంకరరావు మృతి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైనారిటీల సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ముస్లిం, మైనార్టీల సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం అటకెక్కించిందని, గతంలో ముస్లింల కోసం టిడిపి అమలు చేసిన పథకాలను రద్దు చేస్తూ వారికి అన్యాయం చేసిందని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం పార్వతీపురంలోని బంగారమ్మ కాలనీలో గల మసీదును ముస్లింల కోరికపై సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి విజయం కోసం ముస్లిం పెద్దలు ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ ముస్లిం కుటుంబాల సంక్షేమానికి తమ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేకంగా దృష్టి పెడతామని అన్నారు. వీరికి అవసరమైన షాదీ ఖానాల నిర్మాణంతో పాటు ఆర్థికంగా వారి ఎదుగుదలకు ప్రభుత్వం నుంచి అన్ని పథకాలను అందేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం ముస్లిం నాయకులు మాట్లాడుతూ టిడిపి హయాంలో తమకు రంజాన్ కానుకలతో పాటు ఇతర పథకాలు అందగా ఇప్పుడు అలాంటివి ఏమీ లేవని రాబోయే ఎన్నికల్లో తాము టిడిపికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు.


మైనార్టీల నాయకులతో మాట్లాడుతున్న విజయచంద్ర

కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మజ్జి కృష్ణమోహన్, మజ్జివెంకటేష్, పోల సత్యనారాయణ, సింహాలనాయుడు, శ్రీరాములు, మధు, గుండ్రెడ్డి రవి, టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

జయకృష్ణకే టికెట్ ఇవ్వాలి
టిడిపి నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ నియోజకవర్గం టికెట్టు నిమ్మక జయకృష్ణకే ఇవ్వాలని అరకు పార్లమెంటరీ బిసి సెల్ కన్వీనర్ పి.కృష్ణమూర్తి నాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జామి వారి కాంప్లెక్స్లో ప్రెస్ మీట్ కార్యక్రమంలో మాట్లాడారు. సర్వేలో అనుకూలంగా ఉన్నందున జయకృష్ణ నియోజకవర్గం టికెట్టు ఇస్తే 15వేల మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. పాలకొండలో టిడిపి గెలిచే అవకాశాలు క్లియర్గా ఉన్నప్పటికీ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడు పునఃపరిశీలన జరిపి జయకృష్ణకు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జయకృష్ణకు టికెట్టు ఇవ్వకపోతే రోడ్డెక్కుతామన్నారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు పి.నాగేశ్వరరావు, బి.హరిబాబు, ఎన్.శేషకుమార్, సిహెచ్ ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ నిమ్మక జయకృష్ణకు ఒక్క అవకాశం ఇవ్వాలని టిడిపి నాయకులు కోరారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు నిర్వహించారని, ప్రజల్లోని, నాయకుల్లోని జయకృష్ణ ఉన్నారని నాయకులు అన్నారు. జయకృష్ణకు టికెట్ ఇస్తే అత్యంత మెజారిటీతో గెలుస్తారని నాయకులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా సంతోష్, వెన్నపు శ్రీనివాస్ రావు, సుంకరి అనీల్, తదితరులు ఉన్నారు.


భామిని : సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

భామిని : పాలకొండ టిడిపి ఇన్ఛార్జి జయకృష్ణకే టిక్కెట్టు కేటాయించాలని మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు డిమాండ్ చేశారు. మండలం టిడిపి కమిటీ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు మాట్లాడుతూ, జయకృష్ణ తండ్రి నిమ్మక గోపాలరావు ఎమ్మెల్యేగా నిరంతరం పాలకొండ నియోజక వర్గ ప్రజలకు సేవలందించారు. అదే తరహాలో జయకృష్ణ కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తున్నారు. కావున పాలకొండ ఎమ్మెల్యే టిక్కెట్ జయకృష్ణకే కేటాయించాలని కోరారు. సమావేశంలో మండలం కమిటీ సభ్యులు బిడ్డికి ప్రసాద్, సాకేటి రామారావు, నిమ్మల కోర, కొరాడ రాజేష్, అశోక్, లక్ష్మీపతి ఉన్నారు.

తిరుపతిరావు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగుడబకు చెందిన 30 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు గ్రామం ఉపసర్పంచ్గా సేవలు అందించిన కీర్తిశేషులు వర్రి తిరుపతిరావు విగ్రహాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి రావుతో ఆయనకున్న సత్సంబంధాలు, సుదీర్ఘంగా ఉప సర్పంచ్గా గ్రామానికి ఆయన చేసిన సేవలు, ప్రజల మన్ననలు పొందడం చాలా గొప్ప విషయమని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిత్వం గల ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి తనతో పాటు ఎందరికో వారి కుటుంబం, అనుచర వర్గం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, వైసిపి నాయకులు భీమవరపు కష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ పండు, వైస్ సర్పంచ్ వర్రీ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ముమ్వల సత్యం నాయుడు, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, వి.గురురాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు హిందీ పరీక్షలు

కురుపాం : ఈనెల 9, 10 తేదీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రథమ, మద్యమ, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కూమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, డిపార్టమెంట్ అధికారిగా ఎంఇఒ ఎన్.సత్యనారాయణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

పాలకొండ వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పాలకొండ

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు పట్టణంలో కవాతు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి జి.కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిపించేయందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

కురుపాం : మండలంలోని ఏజెన్సీ ముఖద్వారమైన మొండెంఖల్లో ఎల్విన్ పేట సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఆర్పీఎఫ్, సెంట్రల్ పారా మిలటరీ బలగాలతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిఐ ఐఎస్ఎన్ రాజు, స్థానిక ఎస్సై నీలకంఠేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.